

# టేకిట్ ఈజీ!!

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## "పేరా"శ

ఏడేళ్ళకిందటి సంగతే అనుకోండి, మీకింకా చెప్పలేదు కాబట్టి పరవాలేదు.

ఓనాడు నా మానాన నేను కిందకెళిపోయిన మా సోఫా గోతిలో కూచుని శ్రద్ధగా గోళ్ళు కొరుక్కుంటూంటే మా ఫ్రెండుగాడొకడు ఫోను చేసి డిస్టర్బ్ చేసింది చాలక, "ఒరేయ్, నిన్న రాత్రి కొడుకు పుట్టాడురా, అంటే.. రక్ష కి తమ్ముడు పుట్టాడు " అన్నాడు మెల్లిగా. వాడి గొంతులోని భావం అర్ధంకాక "అయాం సారీ, ఈ సారి మళ్ళీ ట్రైచెయ్యి ఖచ్చితంగా ఆడపిల్ల పుట్టచ్చు " అన్నాను అనునయిస్తూ. వాడికి మండి " ఎహె, అదికాదు, నువ్వేదో తెలుగు క్లాసులు చెబుతున్నావటకదా పిల్లలకి, మా వాడికేదన్నా, మాంఛి రైమింగ్ తో ఉండే పేరు చెబుతావేమోనని ఫోను చేసా.." అన్నాడు.

నా దిక్కుమాలిన తెలుగు పరిజ్ఞానం ఇందుకు పనికొస్తోంది గదా అని కించిత్తు వగచి, " సరే, పిల్లపేరేవన్నావు?" అడిగా. "రక్ష" - వెంఠనే అన్నాడు వాడు ఆశగా, నేనేదో చెబుతాననుకుని. "ఇంకేం, హిది చాహాలా సిహింపుల్. అమ్మాయి పేరు రక్ష, అబ్బాయి పేరు రిక్షా. చక్కగా రిథమిక్ గా వుంటుంది. కోపవొస్తే "వొరేయ్ రిక్షా" అని కూడా పిలుచుకోవచ్చు

సినిమాటిక్ గా" అన్నాను తడుపుకోకుండా. "నిన్నడిగాను చూడు, నాదీ బుద్ధి తక్కువ. నువ్వు మరీ ఇంత తింగరోడివేంట్రా, ఏ నక్షత్రంలో పుట్టావు? సర్లే నాతిప్పలేవో నేను పడతా, వుంటా.." . ఫోను కట్ .

\- - - - - - - - - - - - - - - - - -

అసలిప్పుడింకా తగ్గిపోయింది గానీ, నా తింగరితనం వాడికేంతెలుసునూ? అయినా సందర్భవొచ్చింది గాబట్టి చెబుతున్నాను, పెళ్ళంటూ చేసుకున్నాకా పిల్లలు పుట్టకామానరు, వాళ్ళకి పేళ్ళు ( "పేర్లు" కి బహువచనం ! ) పెట్టకా తప్పదు, ఇప్పుడంటే ఆలోచించి ఆలోచించి ఒహటీ, అరా కంటున్నారు గానీ, మా చిన్నతనాల్లో కళ్ళుమూసుకుని వందమదిని కని పారేసే వాళ్ళు గాంధారిలా (మా కృష్ణశాస్త్రి గారు చెప్పినట్టు). మళ్ళా వీళ్ళందరికీ నామకరణాలొహటా? అందుకే పెంటయ్య, పుల్లయ్య, పిచ్చెమ్మ, అచ్చెమ్మ అంటూ లాగించేసేవారు.

మావూళ్ళో దేవుణ్ణి నమ్మని ఓ శాస్త్రీ ఉండేవారు. ఆయన తొల్చూలు పిల్లకి **"ఆరాటం"** అని పేరెట్టారు పెర్సనల్ రీజన్స్ వల్ల. వాళ్ళరెండో పిల్ల పుట్టంగానే ఇంట్లో ఏవో గొడవలొచ్చాయని దాన్ని **"పోరాటం"** అన్నారు. ఆనక పుట్టిన కొడుక్కి నీళ్ళంటే ఇష్టవని **"నీరాటం"** అనీ, చివరి కొడుకు కాస్త బొద్దుగా ఉన్నాడని **"వనాటం"** అనీ పెట్టేసారు. అయితే ఇవన్నీ గజేంద్రమోక్షంలో పోతనగారి పద్యంలో ఉన్నాయని తెలిసి, ఆయన ఆఖరాఖర్లో చాలా మనస్తాపం చెంది, పిల్లల పేర్లన్నీ **జీలకర్ర, బెల్లం, అల్లం, సైంధవ లవణం** గా మార్చి పారేసారు, **లీగల్ గా.**

వేరేవాళ్ళ ఊసెందుకు, నా పేరు ముచ్చటే చెబుతాను.

నేను పుట్టిన తొల్నాళ్ళల్లో మా ఎరకల కావమ్మ నాకు నీళ్ళుపోసేది. అయితే నేను తెగ గోలచేసేవాణ్ణి. దాని కూతురుచేత మాత్రం పోయించుకునేవాణ్ణి. (**"దాని" అనే సంబోధన చనువువల్ల వచ్చింది మాత్రమే నని స్త్రీవాదులూ, ఇతరత్రా వాదులూ గ్రహించ ప్రార్థన** ).

అప్పుడే మనం మహా వంకరోడివని ఊరూవాడా పెచారం అయిపోయింది. సరే నాకు సరిగ్గా సరిపోతుందని **"అష్టావక్రుడు"** అనే పేరు డిసైడైపోయార్ట ఊరి పెద్దలందరూ. ఆఖరి నిమిషంలో నాన్న చక్రం అడ్డేసి, అమ్మ గరిటె అడ్డేసి, అత్తయ్యలూ, మావయ్యలూ అందరూ ఎడతెరిపి లేకుండా , ఏకాత్మతాభావంతో **(అంటే ఏంటో నాకు తెలియదు)** చర్చించి, ఏదన్నా మోడర్న్ నేం అయితే బావుంటుందని, నాలుగు రోజుల సుదీర్ఘ చర్చల అనంతరం, **"శ్రీనివాసు"** అని తీర్మానించి, బారసాలకి రెడీ అయిపోయారు. వారం రోజుల్లో బారసాలనగా నాన్నకి టీ.వీ సీరియల్ లాగా ఒహటే ఎపిసోడు కలగా మళ్ళీ మళ్ళీ వచ్చిందట. దాన్లో ఒక పెద్ద బల్లెం కనిపించేదట. నాన్న తన ఆప్తమిత్రుడు **ఫోర్టీన్** తో ( **అది ఆయన కాలేజీ హాజరుపట్టీలో నెంబరు, మీరు నమ్మండి నమ్మకపొండి, ఆయన్ని అందరూ అలాగే పిలిచేవారు..)** తన కల చెప్పి, దీనిభావం ఏవైవుంటుందా అని సందేహం వెలిబుచ్చితే, ఆయన ఊరుకోకుండా **" బహుశా ఈ కుంక పెద్దయ్యి నీకు పక్కలో బల్లెంలా తయారవుతాడని ఇప్పట్నించే ఇండికేషనిస్తున్నాడేమో దేవుడు, నా మాట విని, వీణ్ణి తీసుకెళ్ళి ఏ సీలేరడవుల్లోనో వదిలేసి , వెనక్కి చూడకుండా వచ్చేయ్.. వాడికి ఆయుద్దాయవుంటే ఏ అడవి సింహాలో** పెంచుతాయి.. " అన్నారట తాపీగా. ఇది మరీ విప్లవాత్మకంగా ఉందని, జాతకాలూ గట్రా చూసే **ట్వెంటీ ఫోరు** నడిగితే " **ఏంలేదూ, బల్లెవంటే సుబ్రమణ్యస్వామి. వాడి పేరుకి ముందు షణ్ముఖ అని కలిపేయ్.."** అంటే, ఇదేదో బావుందని బారసాలనాడు నాపేరు **"డొక్కా షణ్ముఖ శ్రీనివాస్"** గా ఖాయం చేసేసారు. *కలలో బల్లెం వచ్చింది కాబట్టి సరిపోయింది, ఏ పాచికలో, ఆటీన్ రాణో వచ్చుంటే ఏంచేద్దురూ ?* ఎంతలో ఎంత ప్రమాదం తప్పిందోనని చాలా సంతోషించా, చెప్పకపోవడమే.

ఎప్పుడూ చిన్న బొజ్జతో, గిరజాలతో , చిద్విలాసంతో అలరారే నన్ను చూసి, దగ్గరికి తీసుకుని నుదుట్న పాండ్స్ పౌడర్ తో మూడు నామాలు పెట్టేసి, **"వీడు షణ్ముగం పిళ్ళై"** అనేవాడు మా రెండో మావయ్య. అలా అటు అరవా కాక , ఇటు ఆంధ్రా కాక, ఐదోక్లాసు పూర్తిచేసానో లేదో, ఇంకో ఉపద్రవం ముంచుకొచ్చింది. మా వంశంలో పుట్టిన **నెక్ట్ కిడ్** కి నాగేంద్రుడి పేరు పెట్టుకుంటామని మా దొడ్డ మొక్కుకుందిట అన్న పుట్టిన **ఏణ్ణర్థానికి.** అయితే ఆ విషయం నేను పుట్టినప్పుడు మర్చిపోయి, నేను హైస్కూలు కెళ్ళేముందు గుర్తుతెచ్చుకుని, అమ్మకీ, నాన్నకీ గుర్తుచేసింది, **"అలా పెడితే వాడికి చదువులో ఎదురుండదుట"** అని ఆశపెడుతూ. **"షణ్ముఖం"** వాళ్ళ ఫామిలీ ఫొటోలో నాగేంద్రుడున్నాడు కదా అన్న లాజిక్ నిలబడలేదు సెంటిమెంటు ముందు. సరే పేరుపెడితేనన్నా చదువొస్తుందనే ఆశతో మళ్ళీ నాపేరు మార్చేసి, టీ.సీ తీసుకోడానికి హెడ్మేష్టారు దగ్గరికి నన్నొక్కణ్ణే పంపించారు చిన్న చీటీమీద నా కొత్తపేరు రాసి. ఆ చీటీనీ, నన్నూ ఎగాదిగా చూసి, **" నువ్వు బాగా చదివి పెద్దవాడివై మీ అమ్మా, నాన్నలకి పేరుతేవాలిగానీ, నీపేరే మాటి మాటికీ ఇల్లా మార్చేసుకోకోడదు, ఇష్టం వచ్చినట్టు. అయినా లోపం నీ ప్రయత్నంలో ఉంది, పేరులో లేదు. సర్లే, ఇంతకీ నీ పేరు "డొక్కా శ్రీనివాస**

ఫణి" అని మార్చమంటావు అంతేనా? కానీ ఫణి అంటే పుంలింగవో, స్త్రీ లింగవో చప్పున తెలిసేడవదు, అందుకని చివరన కుమార్ అని తగిలిస్తాను, వివాహ సమయంలో పిల్లనిచ్చే మావగారికి కాస్త ఊరటగా, కన్ఫర్మేషన్ గా ఉంటుంది.." అనేసి, మా వీధి మొగలో ఉండే ఆరెంజి రంగు పోస్టు డబ్బాలా ఉన్న ఆయన రెడ్డింకు పెన్ను తో "డొక్కా శ్రీనివాస ఫణి కుమార్" అని రాసేసి ఇచ్చేసారు టీ.సీ మీద.

ఎవడన్నా మేష్టార్లచేత అక్షరాభ్యాసం చేయించుకుంటాడు, కానీ నేను ఏకంగా నామకరణం కూడా చేయించుకున్నాను. అలా బంధు మిత్రుల, కన్నవారల, గురువుల ముచ్చట తీరుస్తూ పేరు పెట్టించుకున్న ఘనత మా కోనసీమ మొత్తమ్మీద నాకే దక్కింది.

పిమ్మట చుట్టాలందరూ వాళ్ళ పిల్లలతో బిజీ అయిపోయారు. నాన్న కూడా ఆఫీసుపనుల్లో బిజీ అయిపోవడంతో కలలూ గట్రా రావడం మానేసాయి. పురజనులందరూ నన్ను భగవత్స్వరూపంగా భావించి, నోటికొచ్చిన పేరుతో పిలిచేవారు. అయినా ఎవ్వరూ సర్టిఫికెట్ల

జోలికీ, టీ.సీల జోలికి పోలేదు కాబట్టి, నాకొక నిలకడైన పేరు ఖరారయ్యింది.

**శృతిలయలు** సినిమా చూసినప్పుడల్లా అమ్మ బెంగెట్టుకునేది, నా పేరులోంచి **షణ్ముఖాన్ని** తీసేసారని. అమ్మ బాధ చూడలేక అద్దం ముందు నించుని ప్రాక్టీసు చేసి ఆ సినిమాలో కుర్రాడిలా మెడ తిప్పడం నేర్చుకున్నాను, శరీరం కదపకండా. అది చూసి అమ్మ భయపడి,

**" వద్దునాన్నా, ఈ మధ్యన డాన్సు స్టేజీలు గెట్టివి ఏర్పాటు చెయ్యంటం లేదట, ఎందుకొచ్చిన రిస్కూ, ఆనక ఏ కాలో విరిగితే, డాక్టరు ఖర్చూ, స్టేజీ మరమ్మత్తు ఖర్చులూ తడిపి మోపెడౌతాయి. ఏదోఒకటి, పేరుందిగా, సద్దుకుపోదాం "** అని సరిపెట్టేసుకుంది.

అయినా నేను రేపో ఎల్లుండో సినిమాల్లోకెళ్ళిపోంగానే, పేరుమార్చేసుకుందావని ఎల్లాగూ డిసైడయిపోయాను. **" కురసావా హిచికాకు "** అయితే ఎలావుంటుందానని ఆలోచిస్తున్నాను

గోళ్ళు కొరుక్కుంటూ. మా ఆవిణ్ణడిగితే **"పిచ్చికాకీ, గచ్చపక్షీ"** ఇవేం దిక్కుమాలిన పేర్లు? హాయిగా **రోషన్, రోనక్, హృదయ్, వాస్తవ్,** లాంటి పేర్లెట్టుకోవచ్చు కదా? అంది.

**హమ్మ హిందీ సీరియళ్ళోయ్, ఆపేర్లెట్టుకుంటే నాకొంప గుల్లే, రేపట్నించీ రోషన్ గాడిలా జుబ్బాలేసుకో, రోనక్ గాడిలా చెవికి జూకాలు పెట్టుకో, హృదయ్ గాడిలా పిలకపెంచుకో అందంటే నా పనేంగాను?** అందుకే, నా శ్రేయోభిలాషులందరికీ చిన్న ఒపీనియన్ పోల్ పంపించాను **"కురసావా హిచికాకు"** పెట్టుకుంటే ఫ్యూచరు ఎలా వుంటుందని అడుగుతూ.

అందరూ విధిగా కామెంట్ల సెక్షను ఒకటే పూర్తిచేస్తి పంపించారు. అందరిదీ ఒహటే మాట

**" పేరులో ఏమీ లేదు, లోపం నీ ప్రయత్నంలో ఉంది .. "** అని.

ఈ మాట ఎక్కడో విన్నట్టుందే అని ఆలోచిస్తూ, నావి అయిపోయాయి కాబట్టి, మా ఆవిడ చేతివేళ్ళు అప్పడిగి తీసుకుని, గోళ్ళు కొరకడం మొదలెట్టా, శ్రద్ధగా. ****